సాక్షి పెద్దపల్లి

సోమవారం, 17, జూలై, 2023



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లన్న స్వామివారికి భక్తులు పట్నాలు వేయించారు. బోనం చేసి నైవేద్యం సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.



ఐదు మోటార్లతో ఎత్తిపోతలు

ధర్మారం: మండలంలోని నంది పంప్‌హౌజ్ నుంచి ఆదివారం ఐదు మోటార్లతో నీటిని ఎత్తిపోయిస్తున్నారు. ఒక్కో మోటార్ నుంచి 2,150 క్యూసెక్కులు పంపింగ్ చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు సన్మానం



నవీన్‌రావును సన్మానిస్తున్న ఏజీపీ మున్నా

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన హైకోర్టు చీఫ్ జస్టిస్ పానుగోటి నవీన్‌రావును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో హైకోర్టు ఏజీపీ సాయిరాంమున్నా సన్మానించారు. నవీన్‌రావు ఉద్యోగ విరమణ పొందగా.. మున్నా ప్రత్యేకంగా కలిసి సత్కరించారు. బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల నాయకుడు జితేందర్ గౌడ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ బదిలీ



రాజశేఖర్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ సిద్దిపేట (పాత కరీంనగర్) జిల్లాలోని హుస్నాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. సెక్రటేరియట్‌లో పనిచేసిన ఆయన మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై సుల్తానాబాద్ వచ్చిన ఆయన కొద్దిరోజుల్లోనే బదిలీ కావడం స్థానికంగా చర్చకు దారి తీస్తోంది. పాలనపరమైన వ్యవహారంలో రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి తేవడంతోనే వచ్చిన కొద్దిరోజులకే బదిలీ చేయించుకున్నారని తెలుస్తోంది. రాజశేఖర్ కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉన్నారని, దూరభారంతోనే బదిలీ చేసుకున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్సే..

పెద్దపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి వీఆర్ఎస్ తప్పదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని పాలించే అవకాశం కేసీఆర్‌కు అప్పగిస్తే ఆయనో చక్రవర్తిలా.. ఎమ్మెల్యేలు సామంతరాజులా వ్యవహరిస్తున్నారని, సహజ సంపదలను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. నరేంద్రమోదీ నీతివంతమైన పాలన చూసి రాష్ట్ర ప్రజలంతా బీజేపీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. నాయకులు మీస అర్జున్‌రావు, ఠాకూర్ రాంసింగ్, సంజీవరెడ్డి, కన్నం అంజయ్య, సమ్మయ్య, రాజు, ఫహీం, గనెబోయిన రాజేందర్, శ్రీనివాసరావు, సాగర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరాలంటే కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన స్వగృహంలో ధూళికట్టకు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రం వచ్చి పదేళ్లు అవుతున్నా.. యువతకు ఉద్యోగాలు లేవన్నారు. బీసీ రుణాల పేరిట మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ కంకణం కట్టుకున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో పూదరి రాజేందర్, మెరుగు రాజు, బుసరపు సురేష్, మొహమ్మద్ రఫీ, మహేందర్ అరుణ్ తదితరులు ఉన్నారు. దుగ్యాల సంతోష్‌రావు, బొంకూరి అవినాష్, మేడి శ్రీనివాస్, ఎండీ.రఫిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్: వచ్చే ఎన్నికల్లో రామగుండంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. పలువురు యువకులు ఆదివారం పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, ముచ్చకుర్తి రమేశ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లోటు వర్షం.. సాగు ఆలస్యం..



ట్రాక్టర్‌తో సాగు చేస్తున్న రైతు

- ఇప్పటికీ కురవని భారీ వర్షం
- చిరుజల్లులతో మొలకెత్తని విత్తనాలు
- వర్షాభావంతో సాగుకు రైతుల వెనకంజ
- అదను దాటుతోందని అన్నదాతల ఆందోళన
- జూన్ నుంచి కురవాల్సింది 264.5 మిల్లీమీటర్లు
- ఇప్పటివరకు కురిసింది 183.4 మిల్లీమీటర్లు మాత్రమే

సుల్తానాబాద్: వర్షాకాలం సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తోంది. అయినా ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు భారీ వర్షం కురవలేదు. ఫలితంగా పంటల సాగు ఆలస్యమవుతోంది. ఇప్పటివరకు కనీసం 20 నుంచి 25 శాతం కూడా మించలేదు. వ్యవసాయశాఖ వివరాల ప్రకారం జిల్లాలో సాగు 19.63 శాతంగా ఉండటం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ఏటా ఈ నెలలోనే చెరువులు, కుంటలు నిండుతాయి. లేదా మూడునాలుగు భారీ వర్షాలైనా సమోదవుతాయి. కానీ.. ఈ ఏడాది జూలై సగం గడిచిపోతున్నా.. భారీ వర్షం ఒక్కటీ కురవలేదు. ఈసారి రుతుపవనాలు రావడమే ఆలస్యమైంది. ఒక్కటంటే ఒక్క గట్టి వాన కూడా పడకపోవడంతో చెరువులు, బావులు, కుంటలు, వాగుల్లోకి చుక్క నీరు రాలేదు. మరోవైపు భూగర్భజల మట్టం తగ్గిపోతోంది. జూన్ ఒకటి నుంచి జిల్లా సాధారణ వర్షపాతం 264.5 మిల్లీమీటర్లకు గాను ఇప్పటివరకు 183.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. ఈ లెక్కన 42.4శాతం మాత్రమే వర్షం కురిసినట్లు.

భూగర్భ జలాలే ఆధారం

జూన్ నెలాఖరు వరకు జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 6.74 మీటర్లుగా ఉంది. నీటి లభ్యత ఆధారంగానే పంపుసెట్ల ద్వారా రైతులు వానాకాలం పంటలు సాగుచేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. అయినా ప్రాజెక్టుల్లోకి తగినంతగా నీరు చేరితేనే ఆయకట్టుకు సాగునీటి విడుదలపై ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంది.

వరుణుడు కరుణించాలి



వరుణ దేవుడు కరుణిస్తేనే పంటలు సాగయ్యే అవకాశం ఉంది. చెరువుల కింద సాగు కావాలంటే చెరువులోకి నీరు రావాలి. భారీ వర్షం ఇప్పటివరకు ఒకటి కురవలేదు. చిరుజల్లులకు పొలం సాగు చేస్తున్న.

– పొన్నం ఎల్లయ్య గౌడ్, రైతు, కాట్నపల్లి

ఎస్సారెస్పీ నీరు విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్సారెస్పీ నుంచి సాగునీటిని విడుదల చేయాలి. కెనాల్ ద్వారా నీరు వస్తే వరి సాగుతోపాటు ఇతర పంటలు కూడా సాగయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకు భారీ వర్షం కురవకపోవడంతో పంటల ఆలస్యం అయ్యాయి.

– వెంకటరమణారావు, రైతు, నీరుకుల్ల

ఈ నెలాఖరు వరకు అదను

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలను ఆసరాగా చేసుకుని పత్తి, మొక్క, పెసర, వరి, కూరగాయలు తదితర ఆరుతడి పంటలను రైతులు పెద్దఎత్తున విత్తుకుంటున్నారు. చాలారకాల పంటల సాగుకు ఈ నెల మొదటిపక్షం, నెలాఖరు వరకే సమయం ఉంది. జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైబడి వరి ప్రధాన పంట కాగా.. ముందుగా వరినార్లు పోసినవారు ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. అయితే స్వల్పకాలిక వరి రకాలను ఈనెలాఖరు వరకు, అతిస్వల్పకాలిక వరిరకాలను ఆగస్టు మొదటివారం వరకు నాట్లకు సమయం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కలవరపెడుతున్న ఆత్మహత్యలు

- గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన ఓ యువతి భర్త వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. నిండు జీవితాన్ని అర్ధాంతరంగా చాలించింది.

- గోదారిఖనిలోని ద్వారకానగర్‌కు చెందిన ఓ యువకుడు భార్య పుట్టింటికి వెళ్లడంతో ఒంటరితనాన్ని భరించలేక ఉరేసుకుని నిండు జీవితాన్ని చాలించాడు. ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో కోల్‌బెల్ట్ ప్రాంతంలో పెరిగిపోతున్నాయి.

- చిన్నచిన్న కారణాలతో బలవన్మరణాలు
- నెలరోజుల్లో పదిమందికిపైగా అఘాయిత్యం
- సమస్యకు చావే పరిష్కారం కారాదు: డాక్టర్ విశ్వమేధి
- పోలీసులను సంప్రదిస్తే సమస్య పరిష్కారం: డీసీపీ వైభవ్‌గైక్వాడ్



గోదావరిఖని: కారణాలేవైనా.. పిల్లాపాపలతో జీవితం సాగించాల్సిన కొందరు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఇటీవల వరుస ఆత్మహత్యలు కలవరపరుస్తున్నాయి. చిన్న కారణాలతోనే అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. విభిన్నజాతులు, సంస్కృతులకు నెలవైన కోల్‌బెల్ట్ ప్రాంతంలో పలు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది గోదావరిఖని, ఎన్టీపీసీ జ్యోతినగర్, రామగుండం, ఆర్ఎఫ్‌సీఎల్, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తమ జీవనశైలిలో మార్పులు వచ్చాయి. ప్రధానంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర సామాజిక మాధ్యమాల వాడకం పెరిగిపోయి విపరీత ధోరణులు మొదలయ్యాయి. ఈ క్రమంలో చిన్న కారణాలతోనే యువ జంటలు కూడా కొన్నాళ్లకే విడిపోతున్నాయి. పలు కుటుంబాల్లో అత్యాధునిక టెక్నాలజీ చిచ్చుపెడుతోంది. సామాజిక మాధ్యమాల వల్ల పాశ్చాత్య ధోరణివైపు ఇక్కడి ప్రజలు మళ్లుతున్నారు. సెల్ఫీల పేరుతో విపరీత పోకడలకుపోతూ ప్రాణాలకు పోగొట్టుకుంటుండగా.. మరికొంత సెల్ఫీ వీడియోలు తీసి ఆత్మహత్యలకు పాల్పడటం కంటతడి పెట్టిస్తోంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగుకావడంతో ఒంటరి జీవితాలు తమను ఏవైపు తీసుకెళ్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో యువతలో సామాజిక మార్పు ఎంతో అవసరం ఉంది. నిత్యం యోగా, ధ్యానం, వాకింగ్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విహారయాత్రలు వారిలో కొంత మేరైనా మార్పు తీసుకవచ్చే అవకాశం ఉంది. కొంతమంది ఒంటరి జీవితానికి అలవాటు పడి క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం కోసం ఎదురుచూపులు

కోల్‌బెల్ట్ ప్రాంతంలో నిత్యం మహిళా వేధింపుల కేసులు పెరిగిపోతున్నాయి. మహిళా బాధిత భర్తలు కూడా అదేస్థాయిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడే వారికి గోదావరిఖనిలో గతంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కొనసాగిన భవనంలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చావే సమస్యకు పరిష్కారం కారాదు



చావే సమస్యకు పరిష్కారం కాదు. మానసిక వ్యాధితో బాధపడే వారికి కుటుంబ సభ్యులు సపోర్టు అవసరం. మానసిక పరిస్థితి గమనించి వారిలో ధైర్యాన్ని కల్పించాలి. డిప్రెషన్‌కు ప్రస్తుతం మంచి మందులున్నాయి. కుటుంబసభ్యులు వారిలో పాజిటివ్ ఆలోచనలు కల్పించాలి. ఓటమి ఎదురైనా విజయానికి ఓ రోజు వస్తుందనే ధైర్యంతో ముందుకు సాగాలి. మార్పుకోసం వైద్యులను సంప్రదించాలి.

– డా.విశ్వమేధి, మానసిక వైద్య నిపుణులు

జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి



డిప్రెషన్‌కు లోనైతే 100కు కాల్ చేయొచ్చు. పోలీసులను సంప్రదిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. చావుతో కుటుంబం రోడ్డున పడటంతోపాటు మరిన్ని సమస్యలు సృష్టించిన వారవుతారు. యువతలో మానసిక స్థైర్యాన్ని కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్కూళ్లు, కాలేజీలు, పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– వైభవ్‌గైక్వాడ్, డీసీపీ, పెద్దపల్లి

అంకితభావమే పోలీసుల లక్ష్యం కావాలి

- సీపీ రెమా రాజేశ్వరి
- బదిలీపై వెళ్తున్న ఏసీపీలు, ఆర్‌ఐలకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఏసీపీలతో సీపీ రాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): వృత్తిపై బాధ్యత, అంకితభావం, ఉన్నతాధికారుల పట్ల విధేయత అధికారులను జీవితంలో ఉన్నతస్థాయికి తీసుకెళ్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న గోదావరిఖని, జైపూర్ ఏసీపీలు గిరిప్రసాద్, గోపతి నరేందర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకుని పరిస్థితులను అవగాహన చేసుకుంటూ, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా వారి హృదయాల్లో చిరస్థానం పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని తాము ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావంతో వృత్తి ధర్మాన్ని పాటిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కాలానుగుణంగా సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని సమయం, సందర్భాన్ని బట్టి విధులు నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఏఆర్ సీఐలు మధుకర్, శ్రీధర్, అంజన్న, అనిల్, రాజేష్‌లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, పెద్దపల్లి ఏసీపీ మహేష్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, సీసీఎస్ ఏసీపీలు వెంకటేశ్వర్లు, ఉపేందర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ బాలరాజు, ఏఆర్ ఏసీపీలు సుందర్‌రావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



ఆనందంలో గంగపుత్రులు

మంథనిలో గంగమ్మకు బోనాలు

ఆషాఢం సందర్భంగా మంథనిలో గంగపుత్రులు ఆదివారం గంగమ్మ తల్లికి బోనాలు చేశారు. బోయిన్‌పేట నుంచి పల్లకిలో శోభాయాత్ర చేపట్టారు. గోదావరి నదికి చేరుకుని గంగమ్మ, గౌరమ్మ, చేప, తాబేలు ప్రతిమలకు పూజలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ బోనం ఎత్తుకుని గంగపుత్రులతో కలిసి నృత్యం చేశారు. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు గంధం వెంకటస్వామి, అంకరి ప్రకాష్, అంబటి సతీష్, శివ, రాజేందర్, కుమార్, బోయిని నారాయణ, ఎరువ చంద్రమోహన్ పాల్గొన్నారు. – మంథని



బోనంతో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ



పెద్దపల్లిలో పోచమ్మతల్లి ఆలయానికి బోనాలతో ప్రదర్శనగా వెళుతున్న భక్తులు

పెద్దపల్లిలో పోచమ్మతల్లికి..

పోచమ్మ తల్లీ.. సల్లంగ చూడమ్మా అంటూ మహిళలు అమ్మవారికి బోనం చేశారు. జిల్లాకేంద్రంలోని ముత్యాల పోచమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. – పెద్దపల్లిరూరల్



ప్రజావిశ్వాసం కోల్పోయిన ఎమ్మెల్యే చందర్

- స్వప్రయోజనాల కోసం అక్రమదందాలు
- సీఎం కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం
- ఒకటో డివిజన్‌లో ప్రజా ఆశీర్వాదయాత్ర



ఒకటో డివిజన్‌లో పర్యటిస్తున్న అధికార పార్టీ ప్రతినిధులు

రామగుండం: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్వప్రయోజనాల కోసం అక్రమ దందాలు, సెటిల్‌మెంట్లతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున సమర్థవంతమైన అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటేనే కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్న పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, మిర్యాల రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య అన్నారు. ఆదివారం రామగుండంలోని ఒకటో డివిజన్‌లో వారు పర్యటించారు. బీఆర్ఎస్ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్, మెడికల్ కళాశాల, మున్సిపాలిటీ, ఇసుక, బూడిద అక్రమదందాలు, ఎన్టీపీసీ ఓబీ కాంట్రాక్టులలో వివిధ రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే చందర్ అభ్యర్థిత్వాన్ని రాబోయే ఎన్నికల్లో వ్యతిరేకించాలని కోరారు. ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేక ఎమ్మెల్యే చందర్ తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ యాత్రలో సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, దాడి మహేశ్, చిలుకూరి సతీశ్, అంజి, బొడ్డుల లక్ష్మి, కాసర్ల వనిత, శాంతమ్మ, గంగమ్మ, శ్రీలత, మంత్రి వెంకటమ్మ, పురాణ మల్లమ్మ, బద్రి స్రవంతి, ఎడ్ల రాకేష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ నీరివ్వండి

పెద్దపల్లిరూరల్: వర్షాలు కురవక నార్లు పోసుకున్న రైతులు ఆగమవుతున్నారని, వెంటనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీరు సరఫరా చేసి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని దేవునిపల్లిలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పర్వతాలుతో కలిసి మాట్లాడారు. ఇప్పటికే పంటసాగు సమయం ఆలస్యమైందని, ఇంకా జాప్యం లేకుండా నీటిసరఫరా చేయాలన్నారు. ఎమ్మెల్యే సహా ఇతరుల ఆక్రమణలో ఉన్న ఆలయ భూములను దేవాదాయశాఖ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మేకల శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, సంతోష్, సురేశ్, రాజం మహంత, రాజన్న, తిరుపతి, కిరణ్ తదితరులున్నారు.

వివాహిత అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వివాహిత గంగిపెల్లి కల్పన(30) అదృశ్యమైంది. ఈమేరకు పోలీసులు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. మండలకేంద్రానికి చెందిన వివాహిత శనివారం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త రాజేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తాగుడుకు బానిసైన భర్త ప్రవర్తనలో మార్పురావడం లేదనే మనస్తాపంతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వివాహిత బంధువులు భర్తకు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర, రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. మండంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గండికోట అనసూయ(30)కు మండలంలోని పదిరకు చెందిన గండికోట శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. శ్రీనివాస్ నిత్యం తాగివచ్చి మృతురాలిని వేధించేవాడు. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో మనస్తాపంతో అనసూయ బాత్‌రూంలోని ఇనుపపైపుకు చీరతో ఉరివేసుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనసూయ మృతికి శ్రీనివాస్ కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతురాలి సోదరుడు బత్తుల కృష్ణంరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దారి తప్పుతున్న యువత

- దొంగతనాలు చేస్తూ జైలుపాలు
- తిరిగి వచ్చి మళ్లీ అదే బాటలో..
- ప్రత్యామ్నాయం లేకనే చోరీలా..?
- పోలీసు శాఖ దృష్టి సారిస్తే మేలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ (ఫైల్)

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఎక్కడ దొంగతనం జరిగినా పాతవారే నిందితులుగా ఉంటున్నారు. వీరిలో ఎక్కువగా యువతే ఉండడం కొంత ఇబ్బందికరమైన విషయం. జల్సాలకు అలవాటుపడో.. సులువుగా డబ్బు సంపాదించాలనే యావనో.. కారణమేదైనా.. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజంలో చిన్నచూపునకు గురవుతున్నారు. వీరివల్ల కోల్‌బెల్ట్ ప్రాంతంలో చోరీలకు ఫుల్‌స్టాప్ పడటం లేదనే చర్చ జరుగుతోంది. అయితే పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వారిలో నిరుపేద యువతను గుర్తించి ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపితే కొంత మార్పు రావచ్చన్న అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

జైలుకు వెళ్లొచ్చాక కూడా చోరీలే..

ఇటీవల కాలంలో చాలా కేసుల్లో పాత నిందితుల పాత్రే కీలకంగా ఉంటోంది. మూడు రోజుల క్రితం జ్యోతినగర్ ఏరియాలో ఓ చోరీ జరిగింది. ఈ దొంగతనానికి పాల్పడిన వారిలో ఎక్కువమంది పాత నిందితులే ఉన్నారు. జల్సాలు, విలాసాలకు అలవాటుపడి ఇలాంటి చోరీలకు పాల్పడుతూ.. పోలీసులకు చిక్కుతున్నారు. పట్టుబడిన నిందితులే మళ్లీమళ్లీ చోరీల్లో కీలకంగా మారుతుండడం పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. కేసులు ఎక్కువ ఉన్నవారిని గుర్తించి పోలీసులు రౌడీషీట్లు, పీడీ యాక్టు నమోదు చేసినప్పటికీ నిందితుల్లో మాత్రం మార్పు రావడం లేదు. గోదావరిఖని టౌన్ పరిధిలో ఇప్పటివరకు 14 మందిపై పీడీ యాక్ట్, 61 మందిపై రౌడీషీట్ నమోదై ఉన్నాయి. గంజాయి బ్యాచ్‌లు, ఇళ్లలో చోరీలకు పాల్పడటం, బెదిరింపులకు దిగడం, బైక్‌ల రైడింగ్‌లు ఇలా కోల్‌బెల్ట్ ప్రాంతంలో యువత దారి తప్పుతున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ దీనిపై లోతుగా అధ్యయనం చేసి వారిని ఉపాధి మార్గాలవైపు మళ్లిస్తే కొంత అశాంతి తగ్గుతుందని భావిస్తున్నారు. పరిశ్రమలు అధికంగా ఉన్న కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఇలాంటి వారికి ఉపాధి చూపడంతోపాటు వారిపై ఓ కన్నేసి ఉంచితే మార్పు కొంతైనా వస్తుందని ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు



పారిశ్రామిక ప్రాంతంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించాలి. అసాంఘిక కార్యకలాపాల వైపు దృష్టి మళ్లి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల తీరును పరిశీలిస్తాం. – గిరిప్రసాద్, గోదావరిఖని ఏసీపీ

పెందోట బాలసాహిత్య పురస్కారానికి 'నిజమైన స్నేహితులు'


శ్రీలత

ధర్మారం: మండలంలోని నర్సింహులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వేల్పుల శ్రీలత పెందోట బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న శ్రీలత రాసిన «నిజమైన స్నేహితులు» కథల పుస్తకానికి పురస్కారం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ.సత్యనారాయణ తెలిపారు. పారిశ్రామిక వేత్త ఏనుగు రేణుకదయానంద్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ముద్రించిన ఈ పుస్తకాన్ని గతేడాది డీఈవో మాధవి ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ ప్రోత్సాహంతో ఈ పుస్తకాన్ని రాసింది. సిద్దిపేట జిల్లాకు చెందిన పెందోట బాలసాహిత్య పీఠం అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు ఏటా రాష్ట్ర వ్యాప్తంగా భాష సాహిత్యంలో వచ్చిన విశిష్ట రచనలకు అవార్డులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా 2022 సంవత్సరానికి ఈ పుస్తకాన్ని ఎంపిక చేశారు. ఆగస్టులో సిద్దిపేటలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందిస్తారని భాస్కర్ తెలిపారు. శ్రీలతను సర్పంచ్ అడువాల అరుణజ్యోతి, ఎంపీటీసీ దాడి సదయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ రాయమల్లు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి


మోహన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం/జూలపల్లి: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్ (48) కరీంనగర్‌లో భవన నిర్మాణ కూలీగా పనులు చేస్తున్నాడు. అంబేద్కర్‌నగర్‌లో ఆదివారం ఉదయం ఆసుపత్రి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో భవనం ఐదవ అంతస్తుకు మెటీరియల్‌ను కింది నుంచి క్రేన్ ద్వారా పైకి తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. కాళ్లు, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రి వద్దకు కార్మికులు తరలివచ్చారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు జోహేర, మహేంద్రకు కూడా గాయాలు అయ్యాయి. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోజువారీ కూలీ..

జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్‌ది నిరుపేద కుటుంబం. రోజువారీ కూలీ పనులకు కరీంనగర్‌కు వెళ్లేవాడు. ఆదివారం ప్రమాదవశాత్తు మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య అంజలి, కుమారుడు రవి, కూతురు సన్నిహిత ఉన్నారు. కూతురుకు పెళ్లి కాగా, కుమారుడు జూలపల్లిలోని కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని భవనం నిర్మాణ యజమాని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడి మృతి


పూలమాల వేస్తున్న జిందం కళాచక్రపాణి


సంజీవ్(ఫైల్)

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు కొమిరె సంజీవ్‌గౌడ్(43) ఆదివారం ఉదయం మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సంజీవ్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సంజీవ్ దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య లత, కూతురు స్నేహిత ఉన్నారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ అనారోగ్యంతో ఉన్న సంజీవ్ ఇంటికెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం సంజీవ్‌ను హైదరాబాద్ పంపించారు. అయినా సంజీవ్‌ను మృత్యువు కబళించడంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంజీవ్ మృతిపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ సంతాపం తెలిపారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్ తదితరులు సంజీవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.


అమ్మవారికి బోనాలతో గ్రామస్తులు


నెత్తిన బోనంతో ఎంఎస్ రాజ్‌ఠాగూర్

మల్కాపూర్‌లో బోనాల పండుగ

జ్యోతినగర్(రామగుండం): స్థానిక మల్కాపూర్‌లో ఆదివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనం ఎత్తుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించారు. డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు రహీం, మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, ఫకృద్దీన్, చుక్కల శ్రీనివాస్, పాతపల్లి రవి పాల్గొన్నారు.

మళ్లీ ఎప్పుడు నియమిస్తారో..?

- ఇటీవల మంథని ఆర్డీవో బదిలీ
- ఎన్నికల వేళ భర్తీ కాని డివిజన్ పోస్టు
- ఆరునెలలకే ట్రాన్స్‌ఫర్‌పై అనుమానాలు
- ఇక్కడ పని చేసేందుకు ఆసక్తి చూపని అధికారులు


మంథని ఆర్డీఓ కార్యాలయం

మంథని: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆర్డీఓల బదిలీల్లో భాగంగా మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి వీరబ్రహ్మాచారికి సూర్యాపేటలో పోస్టింగ్ ఇచ్చారు. కానీ మంథనికి మాత్రం ఎవరినీ నియమించలేదు. బదిలీ అయిన వీరబ్రహ్మాచారి ఆరునెలల క్రితమే ఇక్కడికి వచ్చి సాధారణ బదిలీల్లో మరో చోటికి వెళ్లడం చర్చనీయాంశమైంది. సాధారణంగా మంథనిలో పనిచేసేందుకు అధికారులు ఆసక్తి చూపరు. ఇక్కడ చాలాకాలం ఇన్‌చార్జీలే కొనసాగారు. 39 మంది డెప్యూటీ కలెక్టర్ల స్థాయి అధికారులను బదిలీ చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. మంథనికి మాత్రం భర్తీ చేయకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కువ కాలం ఇన్‌చార్జీలే..

మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి పోస్టుకు ఎక్కువ కాలం ఇన్‌చార్జీలే పనిచేశారు. ఆరునెలల కంటే ఎక్కువగా ఎవరూ ఇక్కడ పనిచేయడం లేదు. దీంతో డివిజన్ ప్రజలకు అసౌకర్యం తప్పడం లేదు. డీఆర్‌ఓ నరసింహామూర్తి ఇన్‌చార్జీగా వ్యవహరించంగా ఆయన బదిలీ తర్వాత వచ్చిన వీరబ్రహ్మాచారి సైతం మరో చోటికి వెళ్లడంతో మళ్లీ ఖాళీ ఏర్పడింది. మంథని ఆర్డీఓ పరిధిలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలు ఉన్నాయి. మంథనిలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒకే ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. అదీ మంథని నియోజకవర్గ నుంచే. దీంతో ఇక్కడ పనిచేసే అధికారులు అధికార, విపక్ష పార్టీలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ వివాదం నెలకొంటుంది. అంతేగాకుండా ఇక్కడ పనిచేసే అధికారులకు పలువురు ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి తలనొప్పిగా మారింది.

భూసేకరణ ఆలస్యం..?

కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి సంస్థ భూసేకరణ ప్రక్రియ చివరి దశలో ఉండగా ఇటీవల కేంద్రం మంజూరు చేసిన జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ చేపట్టాల్సి ఉంది. మంథని డివిజన్‌లోని నాలుగు మండలాల మీదుగా రహదారి నిర్మాణానికి గెజిట్ విడుదలైంది. అవార్డు పాస్ చేసేందుకు గ్రామగ్రామాన సభలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఆర్డీఓను బదిలీ చేసిన ప్రభుత్వం నూతనంగా ఎవరిని నియమించలేదు. డివిజన్ స్థాయి అధికారి పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ప్రజలకు సైతం అసౌకర్యాలు కలిగే అవకాశం ఉంటుంది.

దిగొస్తున్న వంటనూనె ధరలు

సుల్తానాబాద్(పెద్దపల్లి) : ఏడాది క్రితం సామాన్యులకు అందకుండా పోయిన వంట నూనె ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. లీటరుకు సుమారు రూ.80 వరకు తగ్గింది. దీంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం వల్ల అన్నిరకాల వంట నూనెల ధరలు ఆకాశాన్ని చేరాయి. పరిస్థితి కుదుటపడటంతో ఇప్పుడు క్రమంగా తగ్గుముఖం పడుతూ సామాన్యులకు అందుబాటులోకి వస్తున్నాయి. 2020 మార్చిలో కోవిడ్ ఫస్ట్ వేవ్ లాక్‌డౌన్‌కు ముందు వంట నూనె లీటర్ ప్యాకెట్ ధర రూ.85 ఉండేది. లాక్‌డౌన్ అనంతరం యుద్ధం వల్ల 2022 మార్చిలో రూ.200లకు చేరింది. ముఖ్యంగా పొద్దుతిరుగుడు, పామాయిల్ నూనెలను మన దేశం విదేశాల నుంచి 95 శాతం దిగుమతి చేసుకుంటుంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు లీటరు ధర రూ.120 వరకు ఉంది. వారం క్రితం రూ.115కే లభించింది. పామాయిల్ రూ.95, వేరుశనగ రూ.170, రైస్‌బ్రాన్ రూ.118కి లభిస్తుంది. ఆషాఢ మాసం తర్వాత ధరలు ఇంకా తగ్గవచ్చని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్


కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా ఆదివారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో తిరిగి వ్యాపారస్తులు, ప్రజలను కలుసుకున్నారు. అంతక ముందు ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, సదానందం, ధర్మపురి, దాసు, లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న కేకేనగర్ వాసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకే నగర్‌వాసులకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. ఈసందర్భంగా కంటి ఆపరేషన్ చేసుకున్న 20 మందికి క్లబ్ సభ్యులు బ్రెడ్ ప్యాకెట్స్ అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఆపరేషన్‌కు వారి వెంట వెళ్లి సహకరించిన మాజీ సర్పంచ్ బుర్ర మూత్యాలగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, డాక్టర్ శరణ్య, సురేష్ బాబు, పోచయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పోటాపోటీగా 'టిఫిన్ బైటక్'


దేవునిపల్లిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్, పర్వతాలు తదితరులు


గోదావరిఖనిలో టిఫిన్ బైటక్‌లో నాయకులు

పెద్దపల్లిరూరల్: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా ప్రతినెలా సాధారణ కార్యకర్తలు, నాయకులతో సమస్యలు తదితర అంశాలపై చర్చించేలా టిఫిన్ బైటక్ సమావేశాలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. అయితే పెద్దపల్లి మండలంలో ఆదివారం బీజేపీ నాయకులు ముగ్గురు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఈ సమావేశాలను నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. కమలం పార్టీకి చెందిన కాషాయనేతలు ఎవరి కుంపటి వారే పెట్టుకుని తమదే పై చేయి అన్నచందంగా సమావేశాలను జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన బైటక్ సమావేశంలో నాయకులు మీస అర్జున్‌రావు, కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్, సంజీవరెడ్డి, కేశవరావు, కొంతం శ్రీనివాసరెడ్డి, రాజు, సమ్మయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహుని దర్శించుకుని ఆ ప్రాంతంలోనే పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలారపు పర్వతాలు, నియోజకవర్గ ఇంచార్జీ సంతోష్, రాజేశ్వర్‌రావు తదితర పార్టీ నాయకులతో కలిసి సమావేశమయ్యారు. రంగాపూర్ గ్రామంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, నాయకులు గంట సదయ్య, వేణు, కిరణ్, సుధాకర్, శ్రీనివాస్, రాజవీరు, ప్రమోద్‌రావు, సత్యనారాయణరెడ్డి, మనోహర్ తదితర నాయకులు పాల్గొని అల్పాహారం చేసి పార్టీ సంస్థాగత నిర్మాణం, మోడీపాలన తదితర అంశాలపై చర్చించారు.

గోదావరిఖని: బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక శారదనగర్ శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, నాయకులు వడ్డేపల్లి రామచందర్, పి.మల్లికార్జున్, పిడుగు కృష్ణ, కార్పొరేటర్ దుబాసి లలిత, నాయకులు మంచికట్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురిపై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మద్యం మత్తులోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

